
# సేలంసెట్

ప్రకాశాచార్య




మా అబ్బాయి ఈ మధ్య శేలమ్‌పోయి ఒక సెట్ పట్టుకొచ్చాడు. దానినే 'శేలమ్ సెట్' అంటారట. అది చాలా ఫేమస్ కూడానట. అదే శేలమ్ స్టీలుతో తయారు చేయబడ్డ సెట్. దాంట్లో 6 భోజనం పళ్ళాలు, 6 సైడు పళ్ళాలు, ఒక జగ్గు, 6 గ్లాసులు, 12 కప్పులు, 12 స్పూనులు, 3 బౌవెల్సు, 4 గరిటెలు, ఒక హస్తం, మన్ను మశానం చాలా ఉంటాయి. దాని ఖరీదు పన్నెండు వందలట. ఎందుకురా ఇనప సామానుకు పన్నెండు వందలు పెట్టి కొనుక్కొచ్చావ్? హాయిగా ఇంట్లో వెండి సామాను బోలెడువుంటే అని వాళ్ళమ్మ అంటే— ఇప్పుడు ఇది ఫ్యాషన్ మమ్మీ అంటూ తెచ్చిన రోజునే ఇనాగరేట్ చేశాడు. మా డైనింగ్ టేబిల్ నల్గురు మనుష్యులు తినేట్లుగా ఉంటుంది. నాల్గు కుర్చీలే ఉంటాయి. నేనూ, మా అబ్బాయి, నా భార్య, వాడి భార్య మటుకే ఇంట్లో ఉంటాం. ఇద్దరు పిల్లలూ రుషివ్యాలీలో చదువుకుంటున్నారు.

ఇకనేం. ఆ టేబిల్ నిండా ఆ సామాగ్రితో నింపేశాడు. అన్నం వండిన గిన్నెలోంచి బౌవెల్‌లోకి అన్నం, కూర, చారు, సాంబారు ఇవన్నీ తిరిగి ఈ గిన్నెల్లోకి, ఫ్రిజ్‌లోని చల్లని నీరు మర్లా జగ్గులోకి పోయటం, ఆ స్పూనులు, ఆ కత్తులు అంతా మాయమాయగా ఉండేది. భోజనం చేయటమంటే ఓ యుద్ధం చేసినట్లుగా ఉండేది. ఎక్కడెక్కడో ఉండేవి పదార్థాలు. వాటిని లాక్కుని, వాటిని స్పూన్స్‌తో వేసుకొని, మరలా వాటిని యథాప్రకారం ఉంచి, ఇలా నానా తిప్పలూ పడుతున్నాం. ఈ తిప్పలంతా ఒక ఎత్తు. మా పనిమనిషి ప్రహసనం ఒక ఎత్తు.

అది మా పేటంతా టాంటాం వేసింది. వాళ్ళున్నది నల్గురు. 'అబ్బబ్బ! ఎన్ని గిన్నెలు, ఎన్ని ప్లేట్లు, ఎన్ని స్పూనులు, ఎన్ని... ఎన్ని... తోమలేక చచ్చిపోతున్నాను. ఉదయం గిన్నెలు, మధ్యాహ్నం గిన్నెలు, సాయంత్రం గిన్నెలు— నలభై మందికి కూడా ఇన్ని గిన్నెలు రావు. ఏం తింటారో ఏమో! ఎప్పుడూ తిండే తిండి తప్ప ఆ ఇంట్లో ఇంకో రంథి పట్టరు.' అని 'నేను చేయలేనమ్మా!' అంటూ అల్టిమేటం ఇచ్చింది.

'ఏం!' అంది మా ఆవిడ.

'జీతం చాలదు'

'ఎంతకావాల్ట'

'ఇప్పుడు యాభై ఇస్తున్నారు. ఇంకో యాభై ఇప్పించండి.'

'అంటే నెలకు వందా!'

"అవునమ్మగారు! ఇది వరకు ఆరు గిన్నెలు, నాల్గు పళ్ళాలు పడేవి. ఇప్పుడు పదహారు గిన్నెలు, పదహారు ప్లేట్లు, ఇరవై చిన్న గిన్నెలు, పది చిన్న చెమ్చాలు..." ఇలా లిస్టు చదవసాగింది.

"ఆపు ఆపు... అవన్నీ స్టీలువి కదే— ఊరికే టాపు కింద పెట్టి తొలిచేస్తే సరిపోతుంది కదా!"

"ఆ మీ ఇంట్లో నెయ్యి వాట్టం లేదు కదూ!" అంటూ దెప్పి పొడిచింది. మా ఇంట్లో నెయ్యి బాగా వాడ్తాం.

దాని లెక్క ప్రకారం— నెలకి అరవై అయితే— సంవత్సరానికి ఏడువందల ఇరవై ఇవ్వాలి, ఇస్తాం! కానీ మళ్ళా నెలకే మరలా ఇంకో ఇరవై పెంచమంటే...

నేను ఆలోచిస్తున్నాను.

మా ఆవిడా ఆలోచిస్తున్నది

మా కోడలు ఆలోచిస్తున్నది

ఆలోచించనిది మా అబ్బాయి.

"పోనీండి యాభై పెంచండి..." అన్నాడు మా అబ్బాయి (వాడి బాబు సొమ్ము తేరగా ఉన్నట్లు)

"సరే కానీండీ..." అన్నా నేను ఏం జరుగుతుందో చూద్దామనుకుని.

అనుకున్నదే జరిగింది.

మా వీధిలోని దొడ్డమ్మగారు మా ఆవిడను "ఏమే! ఈ వయస్సులో ఆ తిండి పిచ్చేమిటే! మీ పనిమనిషి ఒకటే గొడవ 'ఏం తింటున్నారో అమ్మగారూ! రోజూ గిన్నెల మీద గిన్నెలు ... గిన్నెలు... అంటూ. తిండి తగ్గించాలే వయస్సు వచ్చాక. అబ్బాయికీ అట్లాగే పెడ్తున్నావా ఎమిటే. అతగాడికి షుగరో... ఏదో ఉందనుకుంటాగా.. కాస్త తిండి తగ్గించండి మీరన్నా. పిల్లలు వాళ్ళు ఇప్పుడుకాక ఎప్పుడు తింటారు" అందట.

మా ఆవిడ బిక్కమొఖం వేసుకుంది. అంత పెద్దావిడ ఆవిడే ఇలా సలహా ఇచ్చిందంటే— మా ఆహార కళాపోషణ ఎంత దూరం పోయిందో కదా— అని నాకూ భయం వేసింది.

ఇంతలో కోడలు పిల్ల "ఆ పనిమనిషిని మానిపించేయండి అత్తయ్యా!" అంది.

"నీకేం జరిగింది తల్లీ!" అని అడిగా.

"అది... అది... నన్ను చాలా వింతమనిషిని, దెయ్యాన్ని చూస్తున్నట్లుగా చూస్తున్నది మామయ్యగారూ! అని అంది.

"అయ్యిందీ!" అని "సరే దాన్ని మానిపిస్తే మరి అంట్లు ఎట్లా?" అన్నది ప్రశ్న.

చివరికి దాన్ని మానిపించేసి— అత్తాకోడళ్ళు ఇద్దరూ ఆ పని చేయనిశ్చయించారు.

అనుకున్నట్లు దానికి ఉద్వాసన జరిగింది.

జరిగిన మూడో రోజుకే మా ఆవిడకు నడుం నెప్పులూ— మా కోడలికి విసుగు, కోపం మొదలయ్యాయి....

ఏం జరిగిందో ఏమో! నాల్గో రోజు మా వాడు "ఆ శేలమ్ సెట్ అవతల పారేసి మామూలు కంచాలు, గిన్నెలే వాడండి" అని హుకుం జారీ చేశాడు.

ఈ విషయం ఎలా తెలిసిందో ఏమో మర్లా మా పాత పనిమనిషే వచ్చి 'పాత జీతానికి పది తక్కువిచ్చినా పర్వాలేదమ్మగారూ! మీ ఇంటిని విడిచిపోను. మీ రెంతో మంచి మనుషులు' అంటూ కాకాపట్టి పనిలో చేరింది.

అది అంత ప్రేమగా ఎందుకు పనిలోకి చేరిందంటే— మా ఫ్యాషన్ తిండి వలన ప్రతి రోజూ ఇద్దరికి సరిపడా అన్నీ మిగుల్తాయి. నా భార్య, నా కోడలూ మిగిలినవి పారేయలేక ఉదయంది రాత్రి, రాత్రిది ఉదయం తినేసరికి వారికి ఎక్కడలేని రోగాలు వచ్చేశాయి మరి.

భార్య బాధపడలేక శేలమ్‌కు గుడ్‌బై చెప్పాడు నా పుత్రరత్నం.

ఏదైతేనేం! హాయిగా భోంచేస్తున్నా నేనిప్పుడు నా వెండికంచంలో. ○